శనగ దిగుబడి ఆశాజనకం

- మెట్టలో జోరుగా పంట తీత పనులు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.5,440
- మార్కెట్ ధర రూ.5,600 నుంచి రూ.5,700
- బయట విక్రయాలకు మొగ్గు చూపుతున్న రైతులు


తీతకు సిద్ధంగా ఉన్న శనగ పంట


పండిన శనగ పంటను తీస్తున్న మహిళా కూలీలు


పొలాల్లో యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్న రైతులు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో రైతాంగం ప్రస్తుతం శనగ పంటను ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో వేసిన పంటల్లో వరి తప్పా మిగతా పంటలు పెద్దగా దిగుబడి లేకపోవడంతో రైతులు పెట్టుబడులతో గట్టెక్కారు. అనంతరం రబీలో ప్రభుత్వం 25 శాతం రాయితీపై వివిధ దశల్లో సుమారు 467 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం, చంద్రేడు తదితర గ్రామాల రైతులతో పాటు మండల వ్యాప్తంగా సుమారు 1150 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. సాధారణంగా శనగ పంటకు రెండు, మూడు తడుల నీరు ఉంటే సరిపోతుంది. ఎక్కువగా మంచుతో ఈ పంట ఎదుగుతుంది. నల్లరేగడి నేలల్లో రైతులు ఎక్కువ పత్తి పంట సాగు చేసేవారు. అయితే గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా పత్తి పంటకు కొన్నేళ్లు విరామం ఇవ్వాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించడంతో గత ఆరేళ్లుగా పత్తికి ప్రత్యామ్నాయంగా శనగ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వాతావరణం అనుకూలించడంతో శనగ రైతుల పంట పండింది.

ప్రస్తుతం శనగ పంట చేతికొచ్చే సమయం, దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎకరాకి 8 నుంచి 12 బస్తాల దిగుబడి వస్తుందని రైతులంటున్నారు. మండల వ్యాప్తంగా శనగ పంట తీత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల ద్వారా పంటను తీయించి పోగులు పెడుతున్నారు. ఈ పోగుల వద్దకు నూర్పిడి యంత్రాలను తీసుకువచ్చి అక్కడికక్కడే నూర్పిడి చేసి శనగలను బస్తాల్లో ఒబ్బిడి చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శనగకు మద్దతుధర ప్రకటించింది. క్వింటా రూ.5440లు ప్రభుత్వం ప్రకటించింది.

అయితే పండించిన శనగ పంటను ఇంటికి తీసుకువచ్చి నిల్వ చేసుకోవడానికి స్థలం లేకపోవడం, పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చేందుకు, కూలీలు, యంత్రాలకు చెల్లించడానికి ఖర్చులు అధికమవుతున్నాయి. ఈ క్రమంలో మార్కెట్‌లో క్వింటా రూ. 5,600 నుంచి రూ. 5,700 వరకు ధర వస్తుండటంతో దళారులకు అమ్ముకుంటున్నారు.

ఎకరాకు పన్నెండు క్వింటాళ్ల దిగుబడి



ఈ సీజన్‌లో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై శనగ విత్తనాలు అందించడంతో మెట్ట ప్రాంత రైతులంతా శనగ పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడి పెరిగింది. ఎకరానికి పది నుంచి పన్నెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. బయట మార్కెట్‌లో ధర బాగుండడంతో దళారులకు రైతులు విక్రయిస్తున్నారు.

కంటిపూడి సత్యనారాయణ,
రైతు, చంద్రేడు.

కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాం



మండల వ్యాప్తంగా రైతులు పండించిన శనగల కొనుగోలుకు ప్రతి ఏడాది స్థానిక సొసైటీలో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుంది. ఈ ఏడాది కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం శనగకు ప్రభుత్వం రూ.5,440లు మద్దతు ధర ప్రకటించింది.

కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి,
రంగంపేట మండలం.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినాన్ని ఘనంగా నిర్వహించాలి

పెదపూడి: ఈనెల 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అనపర్తి పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ ఆనాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ ఆవిర్భవించి నేటికి 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి పార్టీ అడుగు పెడుతుందన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి కెనాల్ రోడ్డులో గల వైఎస్సార్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

175 క్యూసెక్కుల గోదావరి జలాల విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 175 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశామని జలవనరుల శాఖ జేఈ సుమంత్ సోమవారం తెలిపారు. పుష్కర పథకం-1 నుంచి ఒక మోటారు ద్వారా నీటిని విడుదల చేశామని, గత నెల నుంచి ఇదే విధంగా గోదావరి జలాలను విడుదల చేస్తున్నామన్నారు. తాగునీటి కోసం, చెరువులు నింపడానికి ఉన్నతాధికారుల సూచనల మేరకు నీటిని వదులుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 13.4 మీటర్లు ఉందన్నారు. గత ఏడాది డిసెంబరు 2వ తేదీ నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల నిలిపివేశామన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ

రాజానగరం: స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఎంపిక చేసిన మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, అనంతరం కుట్టుమెషీన్లు అందజేస్తారని ఎంపీడీఓ జేపీ ఝాన్సీ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీలు, ఈబీసీలతో పాటు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో 45, 60, 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలు ఆసక్తి ఉంటే సమీపంలోని గ్రామ సచివాలయంలో ఉండే సంక్షేమం, విద్యా శాఖలకు చెందిన సహాయకుల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

బిక్కవోలు: చికిత్స పొందుతూ రంగాపురం గ్రామానికి చెందిన వనం దేవి అనే యువతి(19) మృతి చెందినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఇంటర్ చదువుతున్న సమయంలో శివ అనే యువకుడిని దేవి ప్రేమించినట్లు చెప్పారు. ఇటీవల ఆమె తల్లిదండ్రులు ఆమె బావతో వివాహం కుదిర్చారు. దీంతో ప్రేమించిన వాడిని మోసం చేయలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బిక్కవోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారి దివ్య కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసుల సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో సర్పంచి బండారు రమ్య, శివ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతర గ్రామోత్సవం చేశారు.

వివిధ సమస్యలపై ఐదు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. రఘుదేవపురానికి చెందిన చొప్పన సృజన తన ఇల్లు సచివాలయ రికార్డుల్లో తండ్రి పేరున ఉందని, దానిని మార్చాలని కోరుతూ అర్జీ అందించారు. వంగలపూడికి చెందిన గుద్దటి నాగమణి పంచాయతీ ఇంటి పన్ను వేయాలని కోరుతూ అర్జీని అందించారు. అలాగే రీసర్వేలో భూమి తక్కువగా నమోదు అయిందని, దానిని సరిచేయాలని సీతానగరానికి చెందిన కొడవటి వెంకట రామారావు, ఉండేశ్వరపురానికి చెందిన గుమ్మల భద్రలక్ష్మి, రఘుదేవపురానికి చెందిన చింతా పద్మజ కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తమ సాగులో 20 ఏళ్లుగా ఉన్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని గోకవరం మండలం శివరామపట్నం పేదలు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల ఆంజనేయులు తదితరులు ఆర్‌డీవో కార్యాలయ పరిపాలనాధికారి సుజాతకు వినతి పత్రం అందజేశారు. కాగా.. ఆర్‌డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్-మీకోసం కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని ఆర్‌డీవో కార్యాలయ పరిపాలనాధికారి సుజాత తెలిపారు.

తనిఖీకి ఆదేశం

ప్రకాశం నగర్: గౌతమి కో ఆపరేటివ్ సూపర్ బజార్ కార్యకలాపాలపై తనిఖీ చేయాలని తనకు ఆదేశాలు వచ్చినట్టు జిల్లా సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా సూపర్ బజార్ రికార్డుల పరిశీలన, వాంగ్మూలాల నమోదు చేస్తామన్నారు. నెల రోజుల్లో తనిఖీలు పూర్తి చేయనునట్టు తెలిపారు.

క్లుప్తంగా

పూర్ణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం


విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

బిక్కవోలు: పూర్ణ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పదో తరగతి విద్యార్థులు 41 మందికి సుమారు రూ.8 వేల విలువ గల విద్యా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు దేవాదుల అనిల్‌కుమార్, సత్తి శివరామారెడ్డిలు మాట్లాడుతూ తన బాల్య మిత్రుడు యిమంది పూర్ణకుమార్ జ్ఞాపకార్థం ఈ విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్నామన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్టు


పేకాట ఆడుతూ పట్టుబడిన వారిని చూపుతున్న పోలీసులు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో పేకాడుతున్న పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 13 సెల్‌ఫోన్లు, రూ.84,760 స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ సందర్భంగా సీఐ సత్యకిషోర్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, తగిన పారితోషకం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ సుందర్, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


రంగంపేటలో కొలువైన వేంకటేశ్వర స్వామి

రంగంపేట: స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన కొలువై యున్న అలమేలుమంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు దేవరబొట్ల శిరిడీసాయిశర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పోతుల రామ్‌కుమార్, శ్రీను మాష్టారు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు మంగళస్నానం, గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం కల్యాణ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు


బహుమతులు అందుకున్న సీతానగరం హైస్కూల్ విద్యార్థులు

సీతానగరం: పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులను సోమవారం హెచ్ఎం ఎం.వీరభద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్సై డి.రామ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్లో ఈ పోటీలు జరిగాయి. వీటిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.రవితేజశ్రీ ప్రథమ, ఏడో తరగతి విద్యార్థిని ఎస్.లలిత ద్వితీయస్థానంలో నిలిచారు. విజేతలకు ఈనెల 8వ తేదీన రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్ చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. వీరిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు కన్నూరి సతీష్ బాబు, తమ్మయ్య, బ్రహ్మాజీ, శంకర్, సింహాద్రి తదితరులు అభినందించారు.

12న రాజానగరం మండల సమావేశం

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీఓ జేపీ ఝాన్సీ తెలిపారు. మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అవసరమైన సమాచారంతో రావాలన్నారు.

పేదరిక నిర్మూలనకు పీ4 సర్వే


వేండ్రలో పీ4 సర్వేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్ట్‌నర్‌షిప్(పీ4) సర్వే నిర్వహిస్తోందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. వేండ్ర గ్రామంలో జరుగుతున్న పీ4 సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సర్వే పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూప కల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎండీ మోహిద్దీన్, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.కృష్ణ, ఏహెచ్ఏ సతీష్, డిజిటల్ అసిస్టెంట్ ప్రదీప్, మహిళా పోలీసు జి.లావణ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ భూషణ్ పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతానికి పిలుపు

అనపర్తిలో పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి


అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

పెదపూడి: ఈ నెల 12న రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ అధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసన గళం వ్యక్తం చేయడానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతపోరు కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. మాజీ సీఎం జగన్ పాలనలో ఫీజు రీయంబర్స్‌మెంటు ద్వారా లక్షలాది మంది విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు ఇచ్చిన నిరుద్యోగ భృతిని అర్హులైన వారందరికీ అమలు చేయాలన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దుర్గారెడ్డి, బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు కొండేటి భీమేశ్వరస్వామి, స్థానిక పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన్ బాలకృష్ణారెడ్డి, బిక్కవోలు మండల పార్టీ కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చిత్తశుద్ధితో పని చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి


ఈలకొలనులో గ్రామస్తులతో మాట్లాడుతున్న శాంతామణి, నాగలత

రంగంపేట: పారిశుధ్య నిర్వహణలో చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత సూచించారు. రంగంపేట మండలంలోని ఎస్టీ రాజాపురం, ఈలకొలను, జి.దొంతమూరు గ్రామాల్లో సోమవారం ఉదయం వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న ఇంటింటా చెత్త సేకరణ సేవలను పరిశీలించారు. చెత్త సేకరణను శాస్త్రీయ పద్ధతిలో చేయడం, సంపద సృష్టి కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం రావడమే కాక ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య సేవల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫూలే సేవలు నేటి తరానికి ఆదర్శనీయం


ఊలపల్లిలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెదపూడి: మహిళల అక్షరాస్యతకు విశేష కృషి చేసిన సామాజిక సంస్కర్త, కవయిత్రి, ఉద్యమకారిణి సావిత్రీబాయి ఫూలే అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ అన్నారు. రాజుపాలెం గ్రామంలో ఫూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ గుత్తుల పుష్పవతి, గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి మల్లంగి బులివీరన్న ఉన్నత పాఠశాలలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలే 128 వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సోమవారం పాఠశాల వద్ద హెచ్ఎం కొప్పూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ ఫూలే బాలికా విద్యను ప్రోత్సహించిన మహానీయురాలని కొనియాడారు. ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి, మల్లిరెడ్డి బాలకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయం వార్షికోత్సవం


రంగంపేటలో కొలువైన కోదండ రాముడు

రంగంపేట: స్థానిక గ్రామ సచివాలయం ఎదురుగా గల కోదండ రామాలయం ఆరవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కోడూరి వెంకటరత్నం శర్మ ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భజన కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

పెదపూడి: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని డీఆర్‌కే రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ఫ్రెషర్స్‌డే సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్ఆర్ డిగ్రీ, డీఎస్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ టీ.శ్రీనివాసారెడ్డి, పి.త్రివేణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసింహుని దర్శనం.. పూర్వజన్మ సుకృతం


నరసింహస్వామి ఆలయంలో అర్చక స్వాముల ఆశీర్వచనం పొందుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


రథోత్సవంలో ఆకట్టుకున్న వేషధారణలు



- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా రథోత్సవం, కల్యాణం

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం జరిగిన స్వామివారి రథోత్సవం, కల్యాణ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా దేవుని కోనేరులో స్నానమాచరించి, మెట్ల మార్గంలో కొండపై కెక్కి స్వామిని దర్శించుకున్నారు. రథం రోడ్డులో ఆయన నివాసం వద్దకు చేరిన రథోత్సవంలో వచ్చిన స్వామిని స్వయంగా దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోరుకొండలో రూ.3.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, రూ.1.40 కోట్లతో రంగనాథస్వామివారి ఆలయ పునర్నిర్మాణం, రూ.60 లక్షలతో నరసింహుని ఆలయ మెట్లమార్గం పునరుద్ధరణ పనులకు త్రిదండి చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించినట్టు తెలిపారు. ముందుగా గాడాల గ్రామంలోని గంగమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.